క్లుప్తంగా

పది పరీక్షలకు 4107 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నియోజకవర్గంలో బుధవారం నిర్వహించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో హిందీ పరీక్షకు 4107 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 22 కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షకు 4135 మంది రెగ్యులర్ విద్యార్థులకు గానూ 4104 మంది హాజరు కాగా 31 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఒకసారి అనుత్తీర్ణులైన విద్యార్థులు ముగ్గురు పరీక్షలు రాశారు. ఈ పరీక్షలను మండల విద్యాశాఖాధికారి డి.వెంకట రమణ పర్యవేక్షించారు.

23న వాసవి జాగృతి జయభేరి ఐకాన్-2025

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆర్యవైశ్యుల ఆత్మగౌరవ నినాదంతో వారి అభివృద్ధి కోసం స్థాపించిన వాసవి జాగృతి ఇంటర్నేషనల్ మొట్టమొదటి ఇంటర్నేషనల్ కన్వెన్షన్ వాసవి జాగృతి జయభేరి ఐకాన్‌ను మార్చి 23న ఏలూరులో వైభవంగా నిర్వహించనున్నామని నిర్వాహక కమిటీ ప్రతినిధులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రతిష్టాత్మకమైన సమావేశానికి వాసవి జాగృతి ఇంటర్నేషనల్ సభ్యులు మాత్రమే ప్రవేశానికి అర్హులని వివరించారు. ఈ సమావేశంలో ఐసీసీ ఆఫీసర్లు, గవర్నర్లు, కోచ్‌లు, ట్రైనర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే సంస్థ విధి విధానాలు, గడిచిన సంవత్సర కాలంలో సంస్థ చేసిన సేవా కార్యక్రమాలు, రాబోయే కాలంలో చేయబోతున్న ప్రతిష్టాత్మకమైన కార్యక్రమాల వివరాలు, ఆటపాటలతో ఎటువంటి రిజిస్ట్రేషన్ లేకుండా సిల్వర్, గోల్డ్ - శారీ హౌసీ గేమ్, లక్కీడీప్‌లతో నిర్వహించనున్నట్లు తెలిపారు.

37 మందికి ఉద్యోగాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో డీఎల్‌టీసీ ఐటీఐ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాలో 37 మంది యువతకు ఉద్యోగాలు కల్పించినట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. జితేంద్ర బాబు తెలిపారు. ఈ జాబ్ మేళాలో టీవీఎస్ షోరూం, సీఎంఆర్, బజాజ్ క్యాపిటల్, అపోలో ఫార్మసీ కంపెనీల ప్రతినిధులు పాల్గొని మేళాకు హాజరైన 41మందిని ఇంటర్వ్యూలు నిర్వహించారని, వారిలో 37 మందిని వివిధ కొలువులకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సహాయ సంచాలకులు ఎస్. ఉగాది రవి, ఈఓటీవీజీ వరలక్ష్మి, ప్రవీణ్ కృష్ణ, వైపీ కే. ప్రవీణ్, పాల్గొన్నారు.

కార్పొరేటర్ శ్రీదేవి రాజీనామా

ఏలూరు టౌన్: ఏలూరు నగరానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకురాలు, కార్పొరేటర్ పిల్లంగోళ్ల శ్రీదేవి వైఎస్సార్ సీపీకి రాజీనామా చేశారు. ఈ మేరకు బుధవారం ఆమె విలేకరులకు తన రాజీనామా విషయాన్ని వివరించారు.

ఆప్కాస్ రద్దుపై ఆందోళన

- ఏజెన్సీల దందా మళ్లీ మొదలవుతుందని భయం..భయం
- ఆవేదన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులు



ఆప్కాస్ రద్దు వద్దంటూ కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు (ఫైల్)

ఏలూరు (టూటౌన్): ×ఆప్కాస్‌ను రద్దు చేయవద్దు...మా జీవితాలను బుగ్గి చేయవద్దు× అంటూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ కార్పొరేషన్ (ఆప్కాస్)ను రద్దు చేయాలని చేసిన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఇప్పటికే ఏలూరు నగరపాలక సంస్థ కార్మికులు ఇప్పటికే పలు దఫాలుగా నిరసనలు, ధర్నాలు చేశారు. ఆప్కాస్‌ను రద్దు చేయడం వల్ల తమకు నెల నెలా ఒకటో తారీఖున అందే వేతనాలు అందవనీ, ప్రతి నెలా క్రమం తప్పకుండా జమ అయ్యే పీఎఫ్, ఈఎస్ఐ ఖాతాల వాటా సొమ్ము జమ కాదని ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేసి తమకు అనుకూలురైన కాంట్రాక్టర్లకు ఏజెన్సీ పేరుతో అప్పజెప్పితే తమపై వారి పెత్తనం పెరుగుతుందని, తద్వారా వేధింపులు, వేతనాల్లో కోతలు వంటివి షరా మామూలవుతాయని ఉద్యోగులు చెబుతున్నారు.

2019లో ఆప్కాస్ సంస్థ ఏర్పాటు

ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ కార్పొరేషన్ (ఆప్కాస్)పేరుతో గత వైసీపీ ప్రభుత్వం దీన్ని ఏర్పాటు చేసింది. దీని ద్వారా ఏలూరు కార్పొరేషన్‌లోని 800 మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి లబ్ధి చేకూరింది. దీనివల్ల కార్మికులకు ఎంతో మేలు జరిగింది. 1వ తేదీన జీతాలు ఇస్తున్నారని, పీఎఫ్, ఈఎస్ఐలు సకాలంలో జమ చేస్తున్నారని, కనీస వేతనం అమలు చేస్తున్నారని ఉద్యోగులు తెలిపారు. ఆప్కాస్ లేని సమయంలో కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యంగా ఉండేదని, కనీస వేతనాలు అమలు జరిపే వారు కాదని, పీఎఫ్, ఈఎస్ఐలు సరిగా జమ చేసేవారు కాదని, మూడు, నాలుగు నెలలకు ఒకసారి జీతాలు చెల్లించేవారని, అటువంటి బాధలనుంచి ఆప్కాస్ వల్ల కార్మికుల ఉపశమనం పొందారని, దానిని కూటమి ప్రభుత్వం రద్దు చేయడం అన్యాయమని అంటున్నారు. ఆప్కాస్ రద్దు అంటే కార్మికుల జీవితాలు పెనం మీద నుండి పొయ్యి లో పడేసినట్లేనని కార్మికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆప్కాస్ రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలి



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆప్కాస్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తారని ఆశించాం. తీరా చూస్తే ఎంతో కొంత మేలు చేసే ఆప్కాస్ విధానాన్ని రద్దు చేయాలని యోచించడం దుర్మార్గం. రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేసి కార్మికుల మనోభావాలు దెబ్బతినకుండా చూడాలి. ఆప్కాస్‌ను యథావిధిగా కొనసాగించాలి.

– పి.దుర్గ,పారిశుద్ధ్య విభాగం వర్కర్,ఏలూరు కార్పొరేషన్

కార్మికులకు తీరని ద్రోహం



రాష్ట్రంలోని కూటమిప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేయాలని చూస్తే అది కార్మికులకు తీరని ద్రోహం చేయడమే. ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించడం అంటే ఉద్యోగులకు భద్రత లేకుండా పోతుంది. జీత భత్యాలలో కోత, పీఎఫ్, ఈఎస్ఐ నిధులు స్వాహా జరిగే ప్రమాదం పొంచి ఉంది. ప్రభుత్వ చర్యను ప్రతి కార్మికుడూ వ్యతిరేకించాలి. పోరాటం చేయాలి.

– బి.సోమయ్య,జిల్లా ఉపాధ్యక్షులు, సీఐటీయూ,ఏలూరు

ఆప్కాస్‌ను కొనసాగించాలి



కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది అందరికీ కనీస వేతనాలు అందించే ఆప్కాస్ దోహద డింది. కార్మికులకు కొద్దో గొప్పో ఉపయోగకరంగా ఉన్నా ఆప్కాస్ విధానాన్ని రద్దు చేయాలనుకోవడం పాలకుల నిరంకుశత్వానికి అద్దంపడుతుంది. ఆప్కాస్ రద్దు నిర్ణయం తమ సొంత మనుషులకు లబ్ధి చేకూర్చే ప్రయత్నమే ఇది తప్ప మరొకటి కాదు.

– అంగులూరి జాన్ బాబు, మున్సిపల్ కార్మికుడు

ఆర్‌బీఐ ఎల్‌డీఓ పూర్ణిమకు సత్కారం



ఎల్‌డీఓ పూర్ణిమకు వీడ్కోలు పలుకుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్‌డీవోగా విధులు నిర్వర్తించి కర్ణాటకకు బదిలీపై వెళుతున్న పి.పూర్ణిమకు ఘనంగా వీడ్కోలు పలికారు. స్థానిక గౌతమీ సమావేశ మందిరంలో బ్యాంకర్ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఆర్‌బీఐ ఎల్‌డీఓ పూర్ణిమను శాలువతో సత్కరించి మెమెంటోను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో బ్యాంకర్లు, జిల్లా యంత్రాంగానికి సమన్వయంగా ఉంటూ గత రెండేళ్లుగా సమర్థవంతంగా సేవలు అందించిన పి.పూర్ణిమను అభినందించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ ఎస్.శ్రీనివాస్, ఎల్‌డీఎం డి.నీలాంద్రి పూర్ణిమను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం అనిల్ కాంత్, వివిధ శాఖల బ్యాంక్ కంట్రోలర్లు, కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

23 నుంచి సీపీఐ శత వార్షికోత్సవాలు

ఏలూరు (టూటౌన్): భగత్ సింగ్ వర్ధంతి మార్చి 23 నుంచి ఏప్రిల్ 14 అంబేడ్కర్ జయంతి వరకు సీపీఐ శత వార్షికోత్సవాలు సందర్భంగా ప్రసార జాత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ తెలిపారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో పార్టీ ఏలూరు జిల్లా విస్తృత స్థాయి కార్య వర్గ సమావేశం సాక్షి వెంకటాచారి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన వనజ మాట్లాడుతూ ఇటీవల జరిగిన సీపీఐ జాతీయ కార్యవర్గం, రాష్ట్ర కార్యవర్గ సమావేశం చేసిన నిర్ణయాలను వివరించారు. 2025 డిసెంబర్ 26 నాటికి సీపీఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా సీపీఐ దేశంలోనూ, రాష్ట్రంలోనూ, ఏలూరు జిల్లాలో గత 100 సంవత్సరాలుగా నిర్వహించిన కార్యక్రమాలను సాధించిన విజయాలను ప్రస్తుత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను వివరిస్తూ ప్రచార జాత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. సమావేశంలో జిల్లాలో పార్టీ నిర్వహించిన కార్యకలాపాల రిపోర్టును జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ఇచ్చారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగ ప్రభాకర్, రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు, ఎండి మునీరు, బండి వెంకటేశ్వరరావు ఉప్పులూరి హేమ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

రాజ్యాంగం ప్రకారమే ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

ఏలూరు (టూటౌన్): రాజ్యాంగ ప్రకారమే ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధానకార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక లేడీస్ క్లబ్‌లో మాల సంఘాల ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.రాజ్యాంగంలోని ఆర్టికల్ 338 ప్రకారం జాతీయ ఎస్సీ కమిషన్ ఏర్పాటు చేశారని, ఎస్సీ కమిషన్ ఉండగా మళ్లీ రాష్ట్రంలో వన్ మాన్ కమిషన్ వేయటం ఆర్టికల్ 338 ఉల్లంఘించడమే అన్నారు. వర్గీకరణ చేయాలని తపనతో ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టు ఇచ్చిన సూచనలు కూడా అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. కేవలం మాలల మీద కక్షతోటి ఈ వర్గీకరణ చేస్తున్నారనే భావన కలుగుతుందన్నారు. ముందుగా రాష్ట్రంలో కులగణన చేసిన తర్వాత ఎస్సీ వర్గీకరణపై ఆలోచించాలని డిమాండ్ చేశారు. 2011 లెక్కల ప్రకారం ఆధారంగా వర్గీకరణ చేయటం అంటే ఎస్సీ కులాల మధ్యన ఇప్పటికే చిచ్చు పెట్టారన్నారు. ఈ సమావేశంలో నేతల రమేష్ బాబు, పల్లెం ప్రసాద్, మేరుగు సత్యనారాయణ, పులవర్తి కొండబాబు, నూకపెయ్యి కారీక్, పులవర్తి డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మెండెం సంతోష్ కుమార్

ప్రజా సమస్యలను తక్షణం పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్) : ఏలూరు నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సీపీఎం నగర కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. సీపీఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా బుధవారం స్థానిక కుమ్మరి రేవు, లంక పేట ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కుమ్మరి రేవు లో ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలను పాదయాత్ర బృందం దృష్టికి స్థానికులు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ సీపీఎం పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా చైతన్య యాత్ర నిర్వహిస్తుందని అన్నారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 మాసాలైనా నేటికీ వారు చేసిన వాగ్దానాలు అమలు చేసే ప్రయత్నం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కుమ్మర రేవు ప్రాంతంలో మంచినీటి సౌకర్యం కలిపించేందుకు యుద్ధ ప్రాతిపదికను చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కె.రామాంజనేయులు, ఎం.ఇస్సాకు, కె.విజయలక్ష్మి, ఏసుబాబు, బి.సోమయ్య, ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కుమ్మరిరేవు, లంకపేట ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ప్రమాదానికి గురై రోడ్డుపై పడి ఉన్న విఘ్నేశ్వరరావు

ఉంగుటూరు: మండలంలోని జాతీయరహదారిపై ఏలూరు వైపు వెళ్లే మార్గంలో చేబ్రోలు వద్ద మోటారు సైకిల్ వృద్ధుడిని ఢీకొన్న సంఘటన బుధవారం జరిగింది. ఈ ప్రమాదంలో విఘ్నేశ్వరరావు (65)కి తీవ్రగాయాలు కాగా, బైక్ నడిపే అభిషేక్ కుమార్ అనే యువకుడుకు గాయాలయ్యాయి. ఇద్దరినీ తాడేపల్లిగూడెం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నేడు విజయరాయిలో కోకో రైతుల రాష్ట్ర సదస్సు

ఏలూరు (టూటౌన్) : పెదవేగి మండలం విజయరాయిలో గురువారం నిర్వహిస్తున్న కోకో రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. స్థానిక అన్నే భవనం లో బుధవారం అయన మాట్లాడుతూ ఈనెల 20న ఉదయం 10 గంటలకు పెదవేగి మండలం విజయరాయి, గాంధీనగర్ సీతారామ కల్యాణమండపంలో కోకో రైతుల రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సదస్సుకు రైతు సంఘాల రాష్ట్ర నాయకులను, ఏలూరు జిల్లాతో పాటు కోకో సాగు జరుగుతున్న తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి,శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుండి కోకో రైతులను ఆహ్వానించామని వివరించారు. అన్ని ప్రాంతాల నుంచి కోకో రైతులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. కోకో గింజల కొనుగోలు సమస్య తీవ్రంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.కంపెనీలు కోకో గింజలు కొనుగోలు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	32	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	44	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	44	ములక్కాడలు	10, 15
బెండకాయలు	36	కంద	76
పచ్చిమిర్చి	28	బీట్‌రూట్	30
కాకర కాయలు	30-40	కీరా దోస	36
బీరకాయలు (పందిరి)	40	ఫ్రెంచ్‌బీన్స్	70
కాలీఫ్లవర్	--	అల్లం	60
క్యాబేజీ	16	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	30	పాలకూర	10
దొండకాయలు	40	తోటకూర	10
బంగాళదుంపలు	28	చుక్కకూర	10
ఉల్లిపాయలు	30	గోంగూర	07-10
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	20-40	బఠాణి	--
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	50
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.00	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	22.00	29
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.30	21
ఏలూరు - తిరుపతి	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	28
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	28
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	27
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	35
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	20
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

గడ్డివాము దగ్ధం

రూ.2 లక్షల ఆస్తి నష్టం



దగ్ధం అవుతున్న 25 ఎకరాల గడ్డి వామును ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

ఏలూరు (టూటౌన్): స్థానిక వన్‌టౌన్ పరిధిలోని వెంకన్న చెరువు మసీదు రోడ్డులో ఉన్న 25 ఎకరాల గడ్డివాము పూర్తిగా దగ్ధమైంది. దగ్ధమైన గడ్డివాము విలువ రూ.2 లక్షలు వరకు ఉంటుందని బాధితుడు తానింకి రామకృష్ణారావు తెలియజేశారు. అగ్నిప్రమాదం వార్త తెలుసుకున్న ఏలూరు ఫైర్ సిబ్బంది హుటాహుటిన తరలివచ్చి మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు.

శక్తి యాప్‌పై అవగాహన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మహిళల భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అత్యవసర సమయంలో శక్తి యాప్ ద్వారా పోలీసుల సహాయం నిమిషాల వ్యవధిలో అందుబాటులోకి వస్తుందని ఏలూరు మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు తెలిపారు. మహిళలు, బాలికల సంరక్షణ కోసం ప్రత్యేకంగా రూపొందించిన శక్తి యాప్‌పై బుధవారం స్థానిక నరసింహారావుపేట ఎస్ఆర్ఐ డిగ్రీ కాలేజ్‌లో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాప్ వినియోగాన్ని వివరించారు.

సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలి

దెందులూరు: సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని వైఎస్సార్ సీపీ నేత సానిగూడెం గ్రామ సర్పంచ్ శనిపల్లి రామకృష్ణ (విష్ణు) అన్నారు. బుధవారం సచివాలయంలో సర్పంచ్ విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నాయకులు హామీలు ఇచ్చారని సూపర్ సిక్స్‌లో ఒక్క హామీ కూడా అమలు చేయకపోవడం ప్రజలను మోసం సరికాదన్నారు. ప్రతిరోజు ఉచిత బస్సు కోసం నిరుద్యోగులు నిరుద్యోగ భృతి కోసం అడుగుతున్నారని సమాధానం నేను చెప్పలేకపోతున్నామని తెలిపారు.

పంటకు చీరలే రక్షణ

పంటను కాపాడుకునేందుకు వినూత్న ప్రయోగాలు చేస్తున్న రైతులు



భీమడోలు జంక్షన్ సమీపంలో ఓ చేను చుట్టూ చీర కప్పిన దృశ్యం

భీమడోలు: ఆరుగాలం పండించిన పంటను కాపాడుకునేందుకు రైతులు వినూత్న ప్రయోగాలు అవలంబిస్తున్నారు. పచ్చని పంటను రక్షించుకునేందుకు రైతన్నలు ఎన్నెన్నో ప్రయత్నాలు చేసి కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. వరి సాగుకన్నా ఉద్యానవన పంటలను సాగు చేసి అదనపు ఆదాయం పొందవచ్చునని రైతాంగం భావిస్తుంది. దీనికి తోడు ఆకు కూరలు, ఆకుకూరల ధరలు ఆకాశన్నండడంతో రైతులు ఉద్యానవన పంట సాగుపై ఆసక్తిని కనబర్చుతున్నారు. అయితే మెట్ట రైతాంగం ఉద్యానవన పంటలపై నక్కలు, ఇతర జంతువులు దాడి చేసి పంటలను తీవ్రంగా నష్టం చేస్తున్నాయి. దీనితో కొంత మంది రైతులు చేను చుట్టూ విద్యుత్ తీగలు అమర్చుతుండడంతో విద్యుత్ తీగల వల్ల పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో విద్యుత్, పోలీస్ శాఖలు విద్యుత్ తీగలు పెట్టవద్దంటూ సూచించడంతో రైతులు వినూత్న పద్ధతులపై దృష్టి సారించారు. వాటిని సంరక్షించుకునేందుకు రైతులు చేసే పద్ధతుల వల్ల ప్రాణాప్రాయ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీంతో జంతువులు చొరబడకుండా మైకులతో శబ్దాలు చేయడం, చీడపీడల నుంచి సంరక్షణ, విష పురుగులు, దిష్టి కళ్ల పడి తమ పంట దిగుబడిపై ప్రభావం పడుతుంది. దీనితో పంట నష్టం వాటిల్లకుండా రైతులు పంట చుట్టూ పాత చీరలు, నర్సరీల చుట్టూ తెరలు కట్టి పంటను వెయ్యి కళ్లలో కాపలా కాస్తున్నారు. భీమడోలు సబ్ డివిజన్ ఉద్యానవన శాఖ పరిధిలోని భీమడోలు 2100 ఎకరాలు, ద్వారకాతిరుమల 41వేల ఎకరాలు, ఉంగుటూరులో 4800 ఏకరాల్లో ఉద్యానవన పంటల సాగు చేస్తున్నారు. పాక్షిక మెట్ట మండలాలైన భీమడోలు, ఉంగుటూరు మండలాల్లో అయిల్‌ఫామ్, కొబ్బరి, ఖోఖో, ఆకుకూరలు, ఆకు కూరలు, అరటి పంటలు పండిస్తుంటారు. మెట్ట మండలం ద్వారకాతిరుమల మండలంలో అయిల్ ఫామ్, కొబ్బరి, ఖోఖో, దొండ, బెండ, క్యాబేజీ, కాలిఫ్లవర్, చెరకు తదితర పంటలను ఎక్కువగా రైతులు విస్తీర్ణం సాగు చేస్తున్నారు. అయితే ఎక్కువగా రోడ్డు ప్రక్కనే ఉన్న పంటల్లో ఎక్కువగా జంతువులు చొరబడి పంట నష్టం చేస్తుండడంతో రైతులు వాటి నుంచి రక్షించుకునే ప్రయత్నంలో పలు వినూత్న ప్రయోగాలను అవలంభిస్తున్నారు. చీడపీడలు సోకకుండా పంట చుట్టూ చీరతో చుట్టేస్తున్నారు. నర్సరీలో నారు దెబ్బతినకుండా పూర్తిగా తెరలను కప్పేస్తున్నారు. కళ్ల దిష్టి నుంచి కాపాడేందుకు సినిమా హీరోయిన్ల ఫోటోలు పెడుతున్నారు. దీనితో పంటపై దాడి చేసేందుకు వచ్చే జంతువులు వాటిని చూసి దూరంగా ఉంటాయని రైతులు చెబుతున్నారు. అదే విధంగా రాత్రి వేళల్లో జంతువుల బెడద నుంచి కాపాడుకునేందుకు మైక్‌లు పెద్ద పెద్ద శబ్దాలు చేస్తున్నారు. దీనితో రైతులు మైకులు ఏర్పాటుకు రూ.1000ల వరకు అదనంగా ఖర్చు పెట్టాల్సి వస్తుంది. ఏదీ ఏమైనా తమ పంటను కాపాడుకునేందుకు శతవిధాలుగా రైతులు ప్రయత్నాలు చేస్తూ కొంత మేర సఫలీకృతులవుతున్నారు. . దీనిపై ఉద్యానవన అధికారి దేవదానం మాట్లాడుతూ భీమడోలు, ద్వారకాతిరుమల, ఉంగుటూరు, నిడమర్రు మండలాల పరిధిలో సుమారు 47వేల ఎకరాల్లో ఉద్యానవన పంటలను సాగు చేస్తున్నారు. ఈ పంటలను రైతులు కంటికి రెప్పలా కాపాడడంతో పలు ప్రయత్నాలు చేస్తున్నారు. రైతులకు సాగులో మెలకువలను అందించి వారి ఆర్థిక స్వావలంబనకు ఉద్యానవన సిబ్బంది తమ వంతు కృషి చేస్తున్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి



ఆగడాలలంకలో మంచినీటి సమస్యను జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీకి వివరిస్తున్న దృశ్యం

భీమడోలు: మండలంలోని కొల్లేరు గ్రామాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. మండలంలోని గుండుగొలను, ఆగడాల లంక, చెట్టున్నపాడు, మల్లవరం గ్రామాల్లో బుధవారం జిల్లా పంచాయతీ అధికారి కె.అనూరాధతో కలిసి ఆమె పర్యటించారు. గుండుగొలనులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి కేంద్రం పనితీరును వారు పరిశీలించారు. పొడి, తడి చెత్త సేకరణ, సేంద్రియ ఎరువు తయారీ, కేంద్రంలోని యంత్రాల పనితీరుపై సంబంధిత అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీలు చెత్త నుంచి సంపద సాధించి ఆర్థిక స్వావలంబన పొందాలన్నారు. సేంద్రియ ఎరువులను విక్రయించి పరిపుష్టిని సాధించాలన్నారు. వేసవిలో కొల్లేరు గ్రామాల్లో మంచినీటి సమస్యలు రాకుండా సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో అపారిశుద్ధ్య వాతావరణం తలెత్తకుండా పారిశుద్ధ్య డ్రైవ్ జరుగుతుందన్నారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ పద్మావతి, ఈవోఆర్‌డీ ఏ.సుందరి, గ్రామకార్యదర్శి మురళీ, మాజీ ఎంపీపీ శిరిబత్తిన కొండబాబు, ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.